




# నవభూమి

# నల్లగొండ

అనుబంధం

12 ఫిబ్రవరి,2025 బుధవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


## ముక్కంటి జాతరకు

# మూడు లక్షల మంది



**నార్కట్‌పల్లి** చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల సందర్భంగా రథసప్తమి రోజున(తెల్లవారుజామున) నిర్వహించిన కల్యాణోత్సవానికి సుమారు 1.50లక్షల మంది, అగ్నిగుండాల రోజున 50వేలు మిగతా ఉత్సవాలన్నింటికీ కలిపి సుమారు 3 లక్షల మంది భక్తులు జాతరకు వచ్చి ఉంటారని భావిస్తున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా భక్తుల నుంచి కానుకలుగా ఆదాయం రూ.34,84,762 సమకూరింది. మహాకుంభ మేళా, మరికొద్ది రోజుల్లో జరిగే పెద్దగట్టు జాతర లేకుంటే భక్తుల సంఖ్య మరికొంత మంది భక్తులు వచ్చేవారని భావిస్తున్నారు. ఆలయంలో నిత్యార్చనలు, అభిషేకాలను వారం రోజుల పాటు నిలిపివేశారు. కాగా ఈ పర్యాయం జాతర నాటికి ట్రస్టు బోర్డు ఏర్పాటవుతుందని అందరూ భావించారు. రాజకీయ సమీకరణలతో సాధ్యం కాకపోగా కనీసం ఉత్సవ కమిటీనైనా వేస్తారనుకున్నారు. కానీ ఉత్సవ కమిటీని కూడా వేయకుండానే జాతర జరిగింది. దీనికి తోడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉత్సవ విశేషాల్లో పాల్గొనే రాజకీయ నాయకులు కొంత అసంతృప్తికి గురయ్యారు. కోడ్ అమల్లో ఉండటంతో ఉత్సవ నిర్వహణలో ద్వితీయ శ్రేణి రాజకీయ నేతలు తమకు సరైన భాగస్వామ్యం, ఆదరణ లభించలేదని కొందరు తెలిపారు.పనిచేయని హెడ్‌కౌంట్ మిషన ఆలయాల్లో భక్తుల సంఖ్యను తెలుసుకునేందుకు ప్రవేశద్వారాల వద్ద హెడ్ కౌంటింగ్ మిషనను అమరుస్తారు. చెర్వుగట్టులోనూ ప్రవేశద్వారం వద్ద ఇంతకుముందే ఈ యంత్రం ఉండేది. గుట్టపై వానరాల చేష్టలతో వైర్లు తెగిపోతూ మరమ్మతులకు లోనైంది. దానికి మరమ్మతులు చేయించడంలో అధికారులు శ్రద్ధచూపించలేదు. ఫలితంగా భక్తుల సంఖ్యను అంచనా మాత్రమే వేయాల్సి వచ్చింది.జాతర ఆదాయం ఇదే జాతర సందర్భంగా వచ్చే ఆదాయంలో సింహభాగం లడ్డూ, పులిహోరప్రసాదాల విక్రయాలదే. ఈ పర్యాయం లడ్డూ విక్రయాలతో రూ.19,87,780,పులిహోర విక్రయంతో రూ.3,20,400, కల్యాణం టికెట్టు ద్వారా రూ.1,34,000, కల్యాణ కట్నాల కింద భక్తులు సమర్పించుకున్న నగదు రూ.8,89,445, అగ్నిగుండాల కట్నాల కింద రూ.1,03,350, నిత్యాన్నదాన విరాళాలు రూ.49,787 కలిపి రూ.34,84,762 లభించాయి.పకడ్బందీగా పారిశుధ్య నిర్వహణ జాతరలో ఈ పర్యాయం పారిశుధ్యం నిర్వహణ పర్వాలేదనిపించింది. గతేడాది పారిశుధ్యం సేవలపై తీవ్రవిమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఈసారి పక్కా ప్రణాళికతో సేవలను అందించారు. జాతర ప్రాంతాన్ని 10జోన్లుగా విభజించి సిబ్బందిని మూడు షిఫ్టులకు కేటాయించారు. చెత్తఎత్తడం, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాతో విమర్శలకు తావులేకుండా చేశారు.టెండరు భోజనాలు జాతర సందర్భంగా పారిశుధ్య సేవల విధులు నిర్వహించే ఉద్యోగులు, కార్మికులకు ఇంతకుముందు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలోనే భోజనాలు అందేవి. అయితే ఈ పర్యాయం పాలకవర్గాలు లేకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు టెండర్ నిర్వహించి భోజనాలను సరఫరా చేశారు. హైదరాబాద్‌కు చెందిన క్యాటరింగ్ సంస్థ టెండర్‌ను దక్కించుకుని ఐదు రోజుల పాటు ఆహార పదార్థాలను అందించింది.క్యూలైన మార్పు భక్తులు ప్రధానాలయ దర్శనానికి వెళ్లే సమయంలో తొక్కిసలాట జరుగకుండా క్యూలైనలో మార్పుచేశారు. ఇంతకుముందు సాధారణ భక్తులు వెళ్లే మెట్ల నుంచే సర్వదర్శనం, వీఐపీల ప్రవేశం, రూ.50 దర్శనం లైన్లు ఉండేవి. మెట్లకు ఓవైపు ఉచితదర్శనం, ఇంకోవైపు రూ.50ల శీఘ్రదర్శనం క్యూలైన్లు ఉండేవి. మధ్యలో నుంచి వీఐపీలు, దేవస్థాన సిబ్బంది వెళ్లేవారు. భక్తుల క్యూలైన్లతో ఈవో కార్యాలయం వైపు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండేది. వీటిని దృష్టిలో పెట్టుకుని నిత్యాన్నదానానికి వెళ్లే దారిలో మహామంటపానికి ఆనుకుని కొత్తగా క్యూలైన ఏర్పాటుచేశారు.వ్యాపారాలు అంతంతే ఈ జాతరలో వ్యాపారాలు అంతంత మాత్రమే జరిగాయని చిరు వ్యాపారులు చెబుతున్నారు. ఇంత తక్కువగా విక్రయాలు ఉంటాయని ఊహించలేదని కొందరు సంచార దుకాణాల నిర్వాహకులు చెప్పారు.విమర్శలూ ఉన్నాయ్ లైటింగ్ సౌండ్ సిస్టంపై భక్తుల్లో పెదవివిరుపు కనబడింది. ఆలయ విమానగోపురాలు, రాజ గోపురాలకు చేసిన విద్యుత దీపాలంకరణ ఆకర్షణీయంగా లేదన్న విమర్శలు వచ్చాయి. ఉత్సవాల ప్రారంభం రోజున మౌతపీసలు సరిగా పనిచేయక అర్చకులు అసహనం చెందారు. ఇదిలాఉండగా జాతర నిర్వహణ సమ యంలో పోలీసుల తీరుపై విమర్శలు వినవచ్చాయి. ఓ మహిళా భక్తురాలిని ఓ ఎస్ఐ నెట్టివేయడం మినహా ఎలాంటి ఘటనలు జరుగలేదు. పోలీసులు బందోబస్తును నిక్కచ్చిగా నిర్వహించారు. స్థానికనేతలనూ బారికేడ్ల వద్దే ఆపడం కొంత విమర్శలకు తావిచ్చింది. ఇదిలాఉంటే పోలీసు అధికారులు అగ్నిగుండంపై నడిచి భక్తుల్లో ఉత్సాహాన్ని నింపారు. కాగా అగ్నిగుండాల రోజున కల్యాణమండపంలో బారికేడ్లతో ఛాంబర్లు ఏర్పాటుచేసి భక్తులను వదులుతూ తోపులాట జరగకుండా చర్యలు తీసుకున్నారు.

## ప్రతీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు

# అండగా ఉంటాం

ఎమ్మెల్యే బిఎల్ఆర్





**మిర్యాలగూడ నవభూమి ఫిబ్రవరి 11:-** కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి,టిపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ మండల పరిధిలోని 10 ఎంపీటీసీ స్థానాలైన ఐలాపురం, చిల్లాపురం తుంగపాడ్ సామ్యగాని తండా, జప్తివీరప్పగూడెం వెంకటాద్రిపాలెం, చింతపల్లి, కొత్తగూడెం, లక్ష్మీ పురం, గూడూరు గ్రామాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ గ్రామాల్లో సమస్యలను నాయకుల సమస్యలను, కార్యకర్తలు సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు.కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తను గుర్తిస్తామనీ వారికి అండగా ఉంటామని అన్నారు. సేకరించిన సమస్యలను జిల్లా ఇంచార్జీ, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,రాష్ట్ర నీటిపారుదల శాఖ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్రెడ్డి, అలాగే నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ కు తెలియజేసి వారందరి సహాయ సహకారాలతో ప్రతీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సమస్యలను పరిష్కరించేలా చేస్తామని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కావడానికి ఏవిధంగా కష్టపడి పనిచేసారో అదే విధంగా రానున్న స్థానిక ఎన్నికల్లో కూడా పని చేసి కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్ లు, వార్డ్ మెంబెర్స్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆశయ సాధన కోసం..

# ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తాం



## మరమ్మతులు అవసరమున్న 34 అంగన్వాడి భవనాలకు మరమ్మతులకు పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ ఆదేశాలు

### ఐసిడిఎస్ పిఓ మమత



**మిర్యాలగూడ నవభూమి ఫిబ్రవరి 11:-** మిర్యాలగూడ సమీకృత శిశు, మహిళా సంక్షేమ (ఐసిడిఎస్) ఎలాంటి ప్రమాదాలు నివారించేందుకు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి భవనాల మరమ్మతు పనులు గ్రామపంచాయతీ కార్యదర్శుల అధ్వర్యంలో అత్యవసరంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారని మిర్యాలగూడ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత మంగళవారం విలేఖరులకు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో అంగన్వాడి భవనం పెచ్చులుడిన సంఘటనతో అప్రమత్తమై మరమ్మతులు చేయాల్సిన భవనాలను గుర్తించాలని ఆదేశించడం జరిగిందని, గుర్తించామని ఆమె తెలిపారు. మిర్యాలగూడ ప్రాజెక్టులో 34 భవనాలను గుర్తించినట్టు ఆమె తెలిపారు. వాటిలో 32 భవనాలకు చిన్నపాటి మరమ్మత్తులు, 2 భవనాలకు స్లాబు ఇనుప చువ్వలు కనిపించేలా వున్నాయని మేజర్ పనులు త్వరలో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారని ఆమె తెలిపారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని ఆమె తెలిపారు.

## నేడు టోల్ గేట్‌పై ఆలగడపలో అఖిలపక్ష సమావేశం



**మిర్యాలగూడ నవభూమి ఫిబ్రవరి 11:-** నల్లగొండ జిల్లా, సూర్యాపేట జిల్లా సరిహద్దు మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామం శివారులో కోదాడ - జడ్చర్ల జాతీయ రహదారిపై నిర్మించిన టోల్ గేట్ వద్ద టోల్ వసూలుపై ఈ నెల 12న అఖిల పక్షం సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలంగాణ మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలగడప గ్రామంలోనీ మనం దరిల్లు వద్ద సమావేశం ఉంటుందని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగ, వృత్తి, ప్రజాసంఘాల, వ్యాపార, విద్యా సంస్థలు, వాహన యజమానులు, వాహనాలు కొనాలనుకునే వారు, డ్రైవర్లు సమావేశంలో పాల్గొనాలని కోరారు. 20 కిలోమీటర్ల పరిధిలోని వాహనాలకు ఉచితం, స్థానికులకు ఉద్యోగాలు, మిగిలిన రోడ్డు పనులు పూర్తి అంశాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాలసి ఉంటుందన్నారు.

## సహజ సిద్ద పద్ధతులతో చీడ, పీడల నివారణ

**కోదాడ ఫిబ్రవరి 11 నవభూమి** సహజ సిద్ద పద్ధతులతో చీడ పీడలను నివారించవచ్చని వ్యవసాయ సామాజిక కార్యకర్త మొలుగూరి గోపయ్య (గోపి )తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని శ్రీరంగాపురం, చాకిరాల, రత్నవరం గ్రామాలలో ప్రకృతి వ్యవసాయం పై నిర్వహించిన రైతు చైతన్య యాత్రలో భాగంగా ఆయన రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రస్తుత రబీ సీజన్ లో సాగులో ఉన్న వరి పంటలో ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణ పై సహజ సిద్ద పద్ధతులను రైతులకు వివరించారు. నేల ఆరోగ్యం కోసం రసాయన ఎరువులు వాడకుండా జీవామృతం, ఘన జీవామృతం తదితర వాటిని వాడాలని తెలిపారు. చీడ పీడల నివారణకు నీమాస్త్రం, వేప గింజల ద్రావణం, వావిలాకు ద్రావణం, ఆవు మూత్రం పేడ ద్రావణాలు పంటపై పిచికారీ చేసి నివారించవచన్నారు. నేల ఆరోగ్యమే పంట ఆరోగ్యం అని పంట ఆరోగ్యమే మన ఆరోగ్యం అన్నారు. మనతో పాటు మన భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



### బీజేపీ పదేళ్ల పాలనలో

# రైతు ఆత్మహత్యలు అనేకం



**గరిడేపల్లి నవభూమి:** బీజేపీ పదేండ్ల పాలనలో రైతు ఆత్మ హత్యలు పెరిగాయాని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి యాకుబ్ అన్నారు మంగళవారం మండల కేంద్రంలోని యం యస్ భవన్ లో ఆ పార్టీ జనరల్ బాడీ సమావేశం యానాలా సోమయ్య అధ్యక్షత నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం పదేళ్ల పాలనలో లక్ష మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని స్వామినాథన్ కమిషన్ సిఫారసులు చేసిన అమలు చేయలేదని ఈ దేశానికి అన్నం పెట్టే రైతన్న వ్యవసాయానికి సబ్సిడీలు మొత్తం ఎత్తేసి కార్పొరేటర్ల వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు రైతాంగానికి ఉత్పత్తికయ్య ఖర్చు కంటే మరో 50% కలిపి రైతాంగానికి ఇవ్వాలని స్వామినాథన్ కమిషన్ సిపారులు చేస్తే అది చెత్తబుట్టలో పడేశారని అన్నారు పంటలు నష్టాలు వస్తే ప్రధానమంత్రి ఫసల్ బీమా మాటలకే పరిమితమైందని అన్నారు రైతులు పంట రుణాలు తీసుకుంటే బ్యాంకులు వెంటపడి వసూలు చేస్తారని కానీ కార్పొరేట్ కంపెనీల రుణాలు మాత్రం వసూలు చేయలేదని అన్నారు గత 17 సంవత్సరాల్లో 17 కోట్ల లక్షల రుణాలు కంపెనీ బడాబాబుల కొట్టిన రైతుకు మాత్రం మాఫీ చేసే దాంట్లో బిజెపి ముందడుగు వేయడం లేదని అన్నారు ఇప్పటికీ ప్రజలకి విద్య వైద్యం అధిక భారం అవుతుందని అన్నారు 2014 ఎన్నికల ముందు ఈ కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి అధికారం చేపట్టిన తర్వాత ఆ ఔషధం లేదని అన్నారు ఇప్పటి లెక్కల ప్రకారం ప్రభుత్వం 10 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి నిరుద్యోగం పెరిగి యువత పక్కదారి పడుతున్నారని అన్నారు ఒక్క డీఏపీ కట్టపై 630 రూపాయలు పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికీ రైతాంగానికి ఏరియా కోసం కోఆపరేటివ్ బ్యాంకులలో కీలు నిలబడుతున్నారని అన్నారు ప్రధాన మంత్రులు చేసిన అప్పు 56 లక్షల కోట్లు అయితే పది సంవత్సరాలుగా నరేంద్రమోడీ గారు చేసిన అప్పు 114 లక్షల కోట్లు అని ఆకుపన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మల సైదయ్య వెంకటేశ్వర్లు మండల సైదులు సారెడ్డి సైదిరెడ్డి ఏనాల సోమయ్య మాజీ ఎంపీటీసీ యానాల సుశీల రాయిరాల శ్రీనివాస్ బోల్లేపల్లి శ్రీను

### ఆశయ సాధన కోసం..

# ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తాం

◆ సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు





**పెన్‌పహాడ్ ఫిబ్రవరి 11( నవభూమి)** దివంగత కామ్రేడ్ ధనియాకుల గురువయ్య ఆశయ సాధన కోసం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం పెన్ పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామంలో దివంగత కామ్రేడ్ ధనియాకుల గురవయ్య 25వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కామ్రేడ్ గురువయ్య ఉమ్మడి తుంగతుర్తి సూర్యాపేట డివిజన్ కార్యదర్శిగా పనిచేస్తూ నిరంతరం ప్రజా సమస్యలపై ఉద్యమిస్తూ సిపిఎం బలోపేతం కొరకు నిర్విరామంగా కృషి చేస్తున్న గురవయ్యను ప్రత్యర్థి వర్గీయులు సూర్యాపేట పట్టణంలో 1999 ఫిబ్రవరి 11 తేదీన కత్తులు గొ డ్డలతో తో దారుణంగా చంపారు అని తెలిపారు. గురువయ్య ఉంటే మనుగడ సాధించలేమని చేసిన కుట్రలో ఇదొక భాగమన్నారు.. హత్యా రాజకీయాలు చేసిన వారు సమాజంలో ఎవరు మనుగడ సాధించలేకపోయారన్న వాస్తవాలను ఆయన గుర్తు చేశారు. కామ్రేడ్ గురవయ్య. ఉమ్మడి డివిజన్లో ఉన్న ప్రత్యర్థుల దాడులను దౌర్జన్యాలను హత్యా రాజకీయాలను ఎదుర్కెడ్డి నిలిచి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకున్నా చరిత్ర గురవయ్యకు ఉందన్నారు. పెత్తందారులకు వ్యతిరేకంగా సమ సమాజ స్థాపన కొరకు తన జీవితాంతం మార్క్సిజ0.లెనినిజం. సిద్ధాంతాన్ని నీతి నిజాయితీతో ఆచరిస్తూ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడుగా నిలిచాడన్నారు. ఆయన నిర్మించిన ఉద్యమ బాటలో ఇప్పటికీ నేటి యువత గురవయ్యను ఆదర్శంగా తీసుకొని సిపిఎం ప్రజా ఉద్యమాల్లో కొనసాగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు , సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, వీరబోయిన రవి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రణపంగా కృష్ణ , సీనియర్ జర్నలిస్ట్ ధనియాకుల వెంకటేశ్వర్లు మండల కమిటీ సభ్యులు అయితబోయిన సత్యం , ఇరుగు రమేష్,నెమ్మాది పీ రయ్య, నెమ్మాది లక్ష్మమ్మ , ధనియాకుల శ్రీను, బుచ్చిరాములు, ముత్తయ్య, రాములు, గోపాలదాస్ శ్రీరాములు, ముదిగొండ వీరస్వామి , అన్నార%శీ% మాజీ సర్పంచి మీసాల లచ్చయ్య, నకిరేకంటి నరసయ్య, నాగరాజు , సత్యం, నాగార్జున రామ్మూర్తి,,శ్రీరాములు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## కాంతులీనుతున్న స్వర్ణరంజిత శ్రీలక్ష్మీనృసింహుడు

**భువనగిరి నవభూమి** యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి దివ్యవిమాన రాజగోపురం స్వర్ణతొడుగుల పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందుకు సంబంధించి 29సెకన్ల నిడివి గల వీడియోను ఆలయ అధికారులు విడుదల చేశారు. గత ఏడాది దసరా రోజు ప్రారంభమైన బంగారు తాపడం పనులు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల వరకు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. బిగింపు ప్రక్రియను ఈవో దగ్గర ఉండి పరిశీలిస్తున్నారు. బంగారు తొడుగులతో స్వామివారి ప్రతిమ దేదీప్యమానంగా వెలుగుతూ ఆకర్షణీయంగా కనువిందుచేస్తోంది. 14 వరకు తొడుగుల పనులు పూర్తి : ఈవో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దివ్య విమాన రాజగోపురం స్వర్ణతాపడం పనులు ఈ నెల 14లోగా పూర్తికానున్నట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కొండపై ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 23 వరకు మహాకుంభ సంప్రోక్షణ నిర్వహించేందుకు వేదపండితులు మూహూర్తం నిర్ణయించారని చెప్పారు. ఐదు రోజుల పాటు నారసింహ హెూమం నిర్వహించి 23 ఉదయం 11.54 గంటలకు మహాకుంభ సంప్రోక్షణతో స్వామివారి దివ్య విమాన బంగారు గోపురం దర్శించుకోవచ్చన్నారు. 50.5 అడుగులతో దేశంలోనే అత్యంత ఎత్తయిన పంచతల గోపురమన్నారు.

# నాసిరకం మెటీరియల్ తోటి కమ్యూనిటీ హాల్ నిర్మాణం





**కోదాడ ఫిబ్రవరి 11(నవభూమి ప్రతినిధి)** నాసిరకం మెటీరియల్ తోటి కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నారని గ్రామస్తులు మంగళవారం ఆరోపించారు. 10 లక్షల రూపాయలతో మండల పరిధిలోని రామలక్ష్మీపురం గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నారు. నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి అని అధికారులు తెలుపుతున్న కాంట్రాక్టర్లు పట్టించుకోకుండా నాసిరకం ఇసుకను వాడుతున్నారని తెలుపుతున్నారు. వరదలకు కొట్టుకొచ్చిన మట్టి ఇసుకను వాడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఏదైనా నిర్మాణం చేపడితే పది కాలాలు ఉండాలని కోరుకుంటామని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇటీవల కాలంలో నిర్మిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు అన్ని వరదలకు వచ్చిన మట్టి ఇసుకతో నిర్మించడం వల్లనే 10 సంవత్సరాలు కాకుండానే శిథిలావస్థకు చేరుతున్నాయని చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజాధనాన్ని వృధాగానీయకుండా నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్మాణాలు చేపట్టాలి అని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# నేతన్న పొదుపు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏడిఓ శ్రీనివాసరావు

**భూదాన్‌పోచంపల్లి నవభూమి** జియో ట్యాగ్ కలిగి అర్హులైన నేత కార్మికులంతా నేతన్న పొదుపు పథకం కోసం దరఖాస్తులు చేసుకోవాలని చేనేత సహకార సంఘం పర్సని ఇంచార్జ్, ఏడిఓ శ్రీనివాసరావు తెలిపారు. పురపాలక కేంద్రంలో మంగళవారం చేనేత సహకార సంఘం నూతన పథకం సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా కార్మికులు ఇస్తున్న దరఖాస్తులను స్వీకరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ. నేతన్న పొదుపు పథకం కోసం దరఖాస్తులు చేసుకుంటున్న చేనేత కార్మికులంతా కచ్చితంగా మగ్గం కలిగి ఉండి పని చేస్తూ ఉండాలని ఆయన అన్నారు. దరఖాస్తు చేసుకోవాల్సిన నేత కార్మికులంతా తమ దరఖాస్తు తో పాటు అనుబంధ కార్మికుడు జతపరుస్తూ ఆధార్ కార్డు పాస్పోర్టు, జియో ట్యాగ్ నెంబర్ తో పాటు నామినేనికి సంబంధించిన ఆధార్ కార్డును జత పరిచాల్సి ఉంటుందని ఆయన తెలిపారు .15 తారీకు లోపు కచ్చితంగా దరఖాస్తులు చేసుకోవాలని తర్వాత దరఖాస్తులు స్వీకరించబడవని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని కార్మికుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీరితోపాటు సొసైటీ మేనేజర్ రుద్ర ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



# ఓపస్ బ్రిక్స్ కంపెనీ ముందు లారీ ఓనర్లు ఆందోళన







**కోదాడ ఫిబ్రవరి 11 నవభమి ప్రతినిధి** మండల పరిధిలోని కాపుగల్లు గ్రామం లో ఓపస్ బ్రిక్స్ కంపెనీ ముందు లారీ ఓనర్లు,డ్రైవర్లు పురుగు మందు బాటిలతో నిరసన తెలుపుతూ మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులు మల్లెల నారాయణ మాట్లాడుతూ సంవత్సరం కాలం నుండి బ్రిక్స్ లోడ్స్ తోలుతున్న అర కొర డబ్బులు చెల్లిస్తూ మొత్తం డబ్బులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 14 లక్షలు వరకు డబ్బులు చెల్లించాలని గట్టిగా అడగడం తో వేరే లారీ లతో బ్రిక్స్ తరలిస్తున్నారని తమకు తక్షణమే న్యాయం చేయకపోతే చావే దిక్కని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# పోలింగ్ స్టేషన్‌ల ముసాయిదా జాబితా విడుదల

**పెన్‌పహాడ్ ప్రతినిధి ఫిబ్రవరి 11(నవభూమి)**రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల పరిషత్ నియోజకవర్గ సభ్యులు, జిల్లా పరిషత్ నియోజకవర్గం ఓటర్ల జాబితా ఫిబ్రవరి 10న అప్లికేషన్ చేయడమైనదని, అదేవిధంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆమోదంతో ఎంపీటీసీ, జడ్పిటిసి పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రచురించడమైనదని ఎంపీఓ సంజీవయ్య మంగళవారం పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఈ పోలింగ్ స్టేషన్ల పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 13వ తేదీ వరకు తెలియజేయవలసిందిగా కోరారు. 13వ తేదీన అన్ని రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు కార్యదర్శుల తో సమావేశం నిర్వహించబడునని, 14వ తేదీన జిల్లా కలెక్టర్ ఆమోదంతో పై అభ్యంతరాలను పరిష్కరింపబడి 15వ తేదీలోగా చివరి జాబితా ప్రచురింపబడునని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# రామాపురం ఎక్స్ రోడ్‌లోని అంతర్రాష్ట్ర చెక్పోస్ట్ వద్ద తనిఖీలు ముమ్మరం







**కోదాడ ఫిబ్రవరి 11 (నవభూమి ప్రతినిధి)** బాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ కారణంగా ఆంధ్ర తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన రామాపురం ఎక్స్ రోడ్ లోని అంతర్రాష్ట్ర చెక్పోస్ట్ వద్ద వెటర్నరీ అధికారులు మంగళవారం పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. తెలంగాణ ప్రభుత్వం బర్డ్ ఫ్లూ పై ప్రజలను అప్రమత్తం చేసింది. మండల పరిధిలోని నల్లబండగూడెం వద్ద ఉన్న అంతర్రాష్ట్ర చెక్పోస్ట్ వద్ద పోలీసులు,వెటర్నరీ డాక్టర్లు తనిఖీలు ముమ్మరం చేశారు. ఆంధ్ర నుంచి తెలంగాణకు సరఫరా అయ్యే కోళ్లకు సంబంధించి వాహనాలను తనిఖీ చేసి వాటిని తెలంగాణలోకి రాకుండా వెనక్కి పంపుతున్నారు. బర్డ్ ఫ్లూ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో గత వారం రోజులుగా ఈ తనిఖీలను చేస్తున్నారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు, వెటర్నరీ డాక్టర్లు కోడి మాంసం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు.